# విపశ్యన మాసపత్రిక

VOLUME : 5 NO - 8 1 NOV, 2010

*(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగుమాస పత్రిక)*

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్, వనస్థలిపురం, హైదరాబాదు - 70


## "ధర్మవాణి"

*న అన్తలిక్ఖే న సముద్ద మజ్ఝే*
*న పబ్బతానం వివరం పవిస్స*
*న విజ్జతి సో జగతిప్పదేసో*
*యత్థట్ఠితం నప్పసహేథ మచ్చు*

*- ధమ్మపద - 128*

అంతరిక్షం (ఆకాశం)లోగాని, సముద్రం మధ్యలోగాని, పర్వత గుహలలో కాని - జగత్తులో ఎక్కడా మృత్యువు నుండి తప్పించుకోగల ప్రదేశం కన్పించదు.

(చావు నుండి తప్పించుకునే చోటు ఎక్కడా లేదు)

## జలధార ఆగిపోయింది

కోశలదేశ రాజధాని నగరం శ్రావస్తి. నగరంలో మహాధనంతులైన ఒక శ్రేష్ఠి కుటుంబం. ఎన్నో చిన్న-పెద్ద గదులు గల వైభవోపేతమైన ఏడంస్థుల భవంతి. అందులో కేవలం నలుగురే కుటుంబ సభ్యులు. యజమాని, యజమానురాలు, కూతురు మరియు ఒక చిన్న కొడుకు. కూతురు కిశోరావస్థను దాటి యవ్వనంలో అడుగుపెట్టింది. ఇంట్లో వైభవవంతమైన సాధన సంపత్తి. బయటకూడా శ్రావస్తి - "సర్వ-అస్తి" -ఆనందకేళీవిలాసాలతో కూడిన నృత్యగానాలు, మనసును రంజింపజేసే ఆటపాటలు సమృద్ధిగాగల నగరం. తండ్రికి ధనసంపాదన పిచ్చి. రాత్రింబవళ్లు అందులోనే తలమునకలై ఉండేవాడు. తల్లికి పలు సామాజిక సంస్థల్లో, సభల్లో గౌరవ సత్కారాలందుకునే వ్యసనం. పిల్లల ఆలనాపాలనా మంచీచెడూ ఎవరికీ పట్టవు. చిన్నవాడైన పుత్రునికోసం ఒక నౌకరును, యౌవనవతియైన పుత్రిక కోసం మరొక నౌకరును నియమించారు. కూతురు కోసం నియమించబడిన నౌకరు యువకుడు. అతని తోడు నవయవ్వనంలో ఉన్న ఆమెకు చెడు సహవాసంగా మారింది. దుస్సాంగత్యం ప్రభావం చూపింది. ఆమెలో కామవాసనల జ్వరం మేల్కొల్పింది. యువకుడైన పనివాడితో ప్రేమాయణం సాగించింది. కాలు జారనే జారింది. ఆ విశాలమైన భవంతిలో ఏకాంతంలో అనాచారం జరగడానికి బోలెడంత వీలు. ఇద్దరూ రోజురోజుకూ పాపపంకంలో కూరుకు పోయారు.

ఆమెకు 20 ఏళ్ళ వయస్సు వచ్చింది. కూతురు పెళ్ళి చేయాలనే విషయం తల్లిదండ్రులకు గుర్తుకు వచ్చింది. గౌరవం కలిగిన సంపన్న కుటుంబానికి చెందిన యోగ్యుడైన యువకునితో పెళ్ళి కుదిర్చారు. నిశ్చితార్థం జరిగింది. వివాహానికి ముహూర్తం కూడా నిశ్చయమైంది. ఆరోజు పెండ్లి. మగపెండ్లివారు ఊరేగింపుతో రానున్నారు. ఇక్కడ ఈ అనాచారుల్లో గుబులు మొదలైంది. పెండ్లి జరిగి అత్తారింటికి వెళ్ళాక కనుచూపే కరువవుతుంది. ఒకరినొకరు చూసుకొనే వీలే వుండదు. ఇక శరీర సంబంధం అందని ఎండమావియే కదా!

కామవాసనల పంకిలపు బొమ్మకు ప్రేమ అనే మిథ్యా చీరగట్టి, దానిపై త్యాగం అనే భ్రమపూర్వక బంగారు తొడుగులు తొడిగి తమ దుష్కర్మను సమర్థించుకొని, ఇద్దరూ ఇంటినుండి పారిపోయే నిర్ణయం తీసికొన్నారు. ఎంత బీదరికం పాలైనా, ఎన్ని కష్టాలెదురైనా ఇద్దరూ కలిసే ఉందామని సంకల్పం చేసికొన్నారు. పెండ్లివారు రాకముందే వారిద్దరి పలాయనయత్నం సఫలమయింది. అందినంత ధనం, నగలు మూటగట్టుకొని పారిపోయారు. నగరానికి దూరంగా ఒక చిన్నగ్రామంలో కాపురం పెట్టారు.

వెంట తీసుకువచ్చిన ధనం ఎన్నో రోజులు సరిపోలేదు. పాపకర్మల ఫలం ఫలించడం మొదలుపెట్టింది. ఎంతో కష్టంగా రోజులు గడవసాగాయి. రెండేళ్ళకు ఆమె గర్భవతి కూడా అయింది. గర్భం పెరుగుతున్న కొద్దీ ఆమెలో చింతకూడా పెరగసాగింది. "ఇంతటి దారిద్ర్యంలో ప్రసవం ఎలా జరుగుతుంది? బిడ్డ బాగోగులు ఎలా చూడటం?" తల్లిదండ్రుల జ్ఞాపకం సతాయించసాగింది. తన దుష్కర్మ మూలంగా వారి పేరు ప్రతిష్ఠలు మట్టిలో కలిసిపోయాయి. ఈ కారణంగా వారు ఎంతో కోపంతో ఉండి ఉంటారు. కానీ తాను వెళ్ళి క్షమించమని అడిగితే తప్పక క్షమిస్తారు. ఎంత కాదన్నా తల్లిదండ్రులు కదా! వెంటనే పుట్టింటికి వెళ్ళాలని మనసు తొందరపడసాగింది. భర్త భయపడ్డాడు. తిరిగి శ్రావస్తి వెళితే కఠిన రాజదండనకు గురికావలసి వస్తుందని అతని భయం. కనుక అతను వెళ్ళడానికి సిద్ధంగా లేడు. ఇవాళ-రేపు, ఇవాళ-రేపు అంటూ ఏదో సాకు చెబుతూ కాలం వెళ్ళబుచ్చసాగాడు. భర్త అబద్ధపు మాటలతో నిరాశచెంది, నిండుచూలాలైన ఆమె ఒంటరిగానే వెళ్ళాలని నిర్ణయించుకుంది. పనిమీద భర్త బయటకు వెళ్ళినప్పుడు పొరిగింటి వాళ్ళతో చెప్పి శ్రావస్తి నగరం వైపుకు సాగిపోయింది. దారిలో దట్టమైన అడవి. అయినా భయపడకుండా నిండు గర్భంతో అలసి-సొలసిన నడకతో నెమ్మదిగా నడిచిపోసాగింది. ఇంటికి తిరిగి వచ్చిన భర్తకు భార్య వెళ్ళిపోయిన సంగతి తెలిసి, పరుగు పరుగున వెళ్ళి ఆమెను చేరుకున్నాడు. ఇంటికి రమ్మని బతిమాలాడు. కాని ఆమె ఒప్పుకోలేదు. గత్యంతరం లేక అతను కూడా ఆమెతో పాటు ప్రయాణం సాగించాడు. అలా వెళ్తుండగానే దారిలో ప్రసవం జరిగింది. ఆ అడవిలోనే ఒక మగబిడ్డ జన్మించాడు.

ఈసారి భర్త గట్టిగా పట్టుపట్టడంతో ఆమె అతనితో కలిసి ఇంటికి తిరిగి వచ్చింది.

ఈ దీనావస్థలో మరొక రెండేళ్ళు గడిచాయి. మళ్ళీ ఆమె గర్భం దాల్చింది. మళ్ళీ తల్లిదండ్రులు గుర్తుకొచ్చారు. ఈ సారి కూడా భర్త ఏవో కుంటిసాకులు చెబుతూ అలానే కాలయాపన చేయసాగాడు. చివరికి ఒంటరిగానే వెళ్ళడానికి నిర్ణయించుకుంది. పిల్లవాణ్ణి చంకనెత్తుకొని, నిండు గర్భంతో శ్రావస్తివైపు నడవసాగింది. విషయం తెలిసిన భర్త ఉరుకు పరుగుల మీద వచ్చి ఆమెను చేరాడు. పూర్వం వలెనే ఆ నిర్జనారణ్యంలో ఆమెకు ప్రసవవేదన ప్రారంభమైంది. దురదృష్టవశాత్తు అకాలంగా దట్టమైన మబ్బులు కమ్మి పెద్ద గాలివాన కురియసాగింది. అడవంతా చీకట్లు కమ్ముకున్నాయి. తలదాచుకోటానికి చోటే దొరకలేదు. ప్రసవ వేదన అధికమవుతూ ఉంది. ఆమె తడిసిపోకుండా చిన్న కప్పులాంటి ఏర్పాటు అవసరం ఎంతైనా ఉంది. సకల సంపదలతో అన్ని సౌకర్యాల మధ్య ఎంతో వైభవంగా పుట్టిపెరిగిన ఈ శ్రేష్ఠి పుత్రికకు ఈ దురవస్థ తన మూలంగానే కలిగింది కదా అన్న బాధతో భర్త చలించిపోయాడు. ఈ కుంభవృష్టి నుండి ఆమెను కాపాడటానికి ఖచ్చితంగా ఏదో ఒకటి చెయ్యాలని తలచాడు.

ఆమె తలదాచుకోవడం కోసం కొన్ని గడకర్రలను, చెట్ల కొమ్మలను సేకరించి చిన్న కుటీరాన్ని నిర్మించాలని నిర్ణయించుకున్నాడు. తక్షణమే కుటీరానికి కావలసిన సామగ్రి తీసుకురావడానికి ఆ కాళరాత్రిలో చుట్టుప్రక్కల వెదకసాగాడు. రాత్రి గడిచిపోతూ ఉంది. అతను తిరిగి రానేలేదు. ప్రసవవేదనతో ఆ యువతి ఆ త్రోవప్రక్కనే వాననీటిలో బురదలో పొర్లుతూ ఉంది. ఆమె రోదన అరణ్యరోదనే అయింది. వినేవారెవ్వరూ లేరు. సహాయపడటానికి ఏ దిక్కూలేదు. ఇలాంటి దుర్భరమైన స్థితిలో మళ్ళీ ప్రసవమయింది. ఒక పిల్లవాడు జన్మించాడు. తెల్లవారినా కూడా భర్త తిరిగి రాకపోయేసరికి ఆమె గాభరా పడింది. ఇద్దరు పిల్లలను రొమ్ముకు హత్తుకొని భర్తకోసం వెతకసాగింది. కొంచెందూరంలో నీలిరంగుతో బిగుసుకుపోయిన భర్త శరీరాన్ని చూసి దిగ్భ్రాంతి చెందింది. అతని ప్రాణాలు ఎప్పుడో గాలిలో కలసిపోయాయి. ఏ విషసర్పమో అతన్ని కాటేసింది. ఏడుస్తూ, అలమటిస్తూ చేసేదేమీ లేక ఇద్దరు పిల్లలను ఎత్తుకొని ఒంటరిగా శ్రావస్తి వైపుకు బయలుదేరింది.

ఆ ప్రచండ వర్షం ప్రళయాన్నే సృష్టించింది. ఆగే మాటే లేదు. కుండపోతగా కురుస్తూనే ఉంది. త్రోవలోని చిన్న-చిన్న కాలువలు కూడా నదులవలె పరవళ్ళు తొక్కుతూ ప్రవహించసాగాయి. చిన్న-చిన్న సెలయేళ్ళు వరదనీటితో మహానదుల వలె ఉధృతరూపం దాల్చాయి. ఇద్దరు పిల్లలను ఎత్తుకొని ఆ నదిని ఎలా దాటాలి? ఒక ఉపాయం ఆలోచించింది. పెద్ద పిల్లవాడిని సముదాయించి నది ఇవతలి ఒడ్డునే వదిలి, చంటిపిల్లవాణ్ణి తీసుకొని నదిని దాటేసింది. అవతలి ఒడ్డుకు చేరుకొని చిన్న పిల్లవాడిని గుడ్డలో చుట్టి ఒక చెట్టు క్రింద పడుకోబెట్టింది. పెద్ద పిల్లవాడికోసం మరల ఇవతలి ఒడ్డుకు రాసాగింది. కాని ఆమె దృష్టంతా పసిబిడ్డ మీదనే ఉంది. వాడికి ఏ ప్రమాదమూ కలగరాదని ఆ తల్లి మనసులోనే దీవెనలిస్తూ నది మధ్యవరకూ చేరుకుని మళ్ళీ పసిబిడ్డవైపు చూసింది. ఒక పెద్ద రాబందు శిశువును మాంసపు ముద్దగా భావించి వానిపై వాలింది. పిల్లవాణ్ణి రక్షించేందుకు ఆమె ఉష్షూ-ఉష్షూ (ఛూ-ఛూ) అని శబ్దం చేస్తూ తన రెండుచేతులను ఊపసాగింది. కానీ ఆ రాబందుపై దాని ప్రభావమేమీ పడలేదు. అది పసిబిడ్డను కాళ్ళల్లో చిక్కించుకొని ఎగిరిపోయింది. కానీ ఆమె చేసిన ప్రయత్నం యొక్క ప్రభావం ఇవతలి ఒడ్డున కూర్చున్న పెద్దపిల్లవానిపై పడింది. తల్లి అరవడాన్ని, చేతులు ఊపడాన్ని చూశాడు. తల్లి తనను పిలుస్తోంది అని భావించాడు. నీళ్ళలోకి దిగాడు. చూస్తూ-చూస్తూ ఉండగానే నదీప్రవాహపు ఒరవడిలో కొట్టుకుపోయాడు. అసహాయస్థితిలో తల్లి అల్లాడిపోయింది.

భర్త పాము వాత పడ్డాడు. ఒక కొడుకును గద్ద తన్నుకుపోయింది. రెండోవాడు నదిలో కొట్టుకుపోయాడు. ఆ అభాగిని ఏడుస్తూ, అల్లాడిపోతూ శ్రావస్తి వైపుకు సాగిపోయింది. కాని ఇంకా ఆమె దుర్దినాలను చూడవలసి ఉంది. దుష్కర్మల ఫలం ఇంకా మిగిలి ఉంది. శ్రావస్తి పొలిమేరల్లో స్మశానం ప్రక్కగా వెళుతూ చితిమీద మూడు శవాలు కాలుతూ ఉండటం చూసింది. అటుగా వచ్చిన ఒక వ్యక్తిని చనిపోయిన వారి గురించి అడిగింది. రాత్రి వచ్చిన ఘోరమైన తుపాను కారణంగా ఏడంతస్థుల మేడ కూలి అందులోని శ్రేష్ఠి గారు, వారి భార్యాపుత్రులు మరణించారని అతను చెప్పాడు. పూర్తి వివరాలు సేకరించగా వారు తన తల్లిదండ్రులు, తమ్ముడు అని తెలిసింది. వారి శవాలే కాలుతున్నాయని తెలుసుకుంది. ఆమె మీద దుఃఖాల మహా పర్వతం విరిగి పడినట్లైంది. ఇప్పుడు తనకు ప్రపంచంలో నా అన్నవారెవ్వరూ లేకుండా పోయారు. దుఃఖం దావానలంలా దహించివేసింది. ఆమె తెలివి కోల్పోయింది. ఈ అశనిపాతాన్ని తట్టుకోలేక స్పృహతప్పి పడిపోయింది.

కొంచెం సేపటికి మేల్కొంది. కానీ పోయిన తెలివి అలాగే పోయింది, తిరిగిరాలేదు. పూర్తిగా పిచ్చదై పోయింది. ఒక్కొక్కటిగా శరీరంపై ఉన్న బట్టలన్నీ తీసి గిరాటువేసింది. పూర్తి నగ్నంగా శ్రావస్తీ నగర వీథుల్లో తలబాదుకుంటూ, రొమ్ము పైన కొట్టుకుంటూ అల్లాడిపోతూ తిరగసాగింది.

"అయ్యో! నా భర్తను కాలసర్పం కాటేసింది! చిన్న బిడ్డను గద్ద తన్నుకు పోయింది! పెద్దవాడిని నది లాక్కుపోయింది! పుట్టింటివాళ్ళు ఇల్లుకూలి మట్టిలో కలిశారు! ముగ్గురూ ఒకేసారి చితి మంటల పాలయ్యారు!" అని విలపిస్తూ తిరుగుతోంది. ప్రజలు ఆమె దీనాలాపనలను వింటున్నారు. దుఃఖం వ్యక్తపరుస్తూనే ఉన్నారు. కానీ ఇంతకన్నా ఏం చేయగలరు? కాలం గడిచేకొలది ఆమె పిచ్చి అందరికీ వెగటనిపించ సాగింది. సానుభూతి చూపించినవారే తలుపులు వేసుకోవడం మొదలుపెట్టారు. ఆమె చెంతకు చేరేవారు, ఆమెను చెంతకు చేర్చుకునే వారు ఎవ్వరూ లేరు. అల్లరి పిల్లలు కొందరు ఆమెపై రాళ్ళు రువ్వుతూ, మట్టిచల్లుతూ 'పిచ్చిది-పిచ్చిది' అంటూ ఆమె వెంటపడి తరిమేవారు.

ఇలాంటి అధ్వాన్నస్థితిలో ఆమె తన పూర్వపుణ్యఫలం కారణంగా ఒకానొకరోజు జేతవన విహారం ప్రక్కగా నడవసాగింది. ఆ సమయంలో అక్కడ భగవానుడు ఒక పెద్ద సభలో ధర్మాన్ని తెలియజెపుతూ ఉన్నాడు. ఆమెను చూడగానే కొందరు ఎడంగా పారిపోదామనుకున్నారు. "ఈ పిచ్చిది ధర్మసభ శాంతిని భగ్నం చేయదు కదా!" అనుకున్నారు. కాని భగవానుని దృష్టి ఆ దుఃఖితురాలిపై పడింది. ప్రజలను ఆపాడు. దుఃఖితురాలు భగవానుని సమీపానికి వచ్చింది. ఇనుము

అయస్కాంతాన్ని చేరినట్టుగా, ఆమె ఆయన దరికి చేరింది. భగవానుడు అపారమైన కరుణతో ఆమెను లాలించాడు. "అమ్మా, నా బంగారు తల్లీ! దుఃఖంలో ఉన్నావు. తెలివి తెచ్చుకో బిడ్డా!" ఆ వాక్కుల్లో అమృతం నిండి ఉంది. ఈ అమృతవాక్కులు వినడంతోనే ఆ దుఃఖితురాలికి కొంచెం తెలివి వచ్చింది. ఆమె దృష్టి తన నగ్నశరీరంపై పడింది. సిగ్గుతో చచ్చిపోయింది. ఒళ్ళంతా ముడుచుకుని కూర్చుండిపోయింది. దగ్గరే నిలుచున్న ఒక సోదరుడు తను కప్పుకున్న దుప్పటి ఆమెపైకి విసిరాడు. ఆమె దాన్నే నిండా చుట్టుకుంది. మతితప్పిన స్థితిలో అన్ని వస్త్రాలనూ తీసివేసిన కారణంగా ఆ దుప్పటి కప్పుకున్న దుఃఖితురాలి పేరు "పటాచార" – (దుప్పటి కప్పుకున్న స్త్రీ) అని స్థిరపడింది. ప్రజలు ఆమె అసలు పేరే మరిచిపోయారు.

పటాచార భగవానునికి మరింత దగ్గరగా వచ్చి రెండు చేతులు, రెండు కాళ్ళు మరియు శిరస్సు భూమికి ఆనించి పంచాంగ ప్రణామం చేస్తూ "భంతే భగవాన్! నాకు శరణు ఇవ్వండి, ఎంతో దుఃఖంతో ఉన్నాను" అని పలికింది.

"బిడ్డా! నీవు సరైన చోటుకే వచ్చావు. శరణు పొందతగిన చోటుకే వచ్చావు. ఇక్కడ నీకు అవశ్యంగా శరణు దొరుకుతుంది" అని భగవానుడు అభయమిస్తూ పలికాడు.

"భంతే భగవాన్! కావాలనుకొన్న భర్తను కాలనాగు కాటేసింది. కన్నపిల్లలు కాకుండా పోయారు. పుట్టింటి వాళ్ళు మట్టిలో కలిసిపోయారు. పంచన చేరడానికి ఈ ప్రపంచంలో ఎవ్వరూ లేరు. నాకు శరణు ఎవరిస్తారు?" తన దుఃఖాలను తలచుకొని పటాచార వెక్కి వెక్కి ఏడవసాగింది.

"బిడ్డా! తెలివి తెచ్చుకో. తల్లిదండ్రులు, సోదరులు, బంధువులు, పుత్రులు, భర్త ఎవ్వరు కూడా శరణు ఇవ్వలేరు. ధారణ చేసిన ధర్మం మాత్రమే సరియైన శరణు ఇస్తుంది. నువ్వు ఏ ప్రియబాంధవుల మృత్యువు వలన దుఃఖంతో కన్నీళ్ళు కారుస్తున్నావు? ఈ అనంత భవసంసారంలో లెక్కలేనన్ని సార్లు జన్మించావు. అన్ని జన్మల్లోనూ ఎందరో ప్రియమైన బంధువులు మరణించారు. వారందరి మరణంతో నీవు ఎన్ని కన్నీళ్ళు కార్చావో వాటన్నింటినీ గనుక ఒక్కచోట కలిపితే ఈ నాలుగు మహా సముద్రాల జలం కూడా తక్కువే. ఇంకా ఎన్ని జన్మల పాటు ఈ ప్రియవియోగంలో పడి ఏడుస్తావు? ప్రమాదాన్ని వదిలి తెలివి తెచ్చుకో! తెలివిగలవాడు చేయవలసిందేమంటే అంతులేని ఈ దుఃఖమయ భవసాగరం యొక్క సత్యాన్ని అర్థం చేసుకొని శీఘ్రాతి శీఘ్రంగా ముక్తి మార్గాన్ని వెతకడం, ఎల్లప్పటికీ (పూర్తిగా) దుఃఖ విముక్తుడై పోవడం."

భగవానునిని వాణి నుండి అమృతం కురిసింది. ఆమె దాన్ని గ్రహించింది. ఆయన మాటలు వింటూ–వింటూ ఆ దుఃఖితురాలి చిత్తం ఏకాగ్రమైంది. కొంచెం సేపు అంతర్ముఖి అయింది, తనను తాను చూసుకొంది. శరీరంలోని అణువణువులో ఉదయ–వ్యయాల ప్రత్యక్ష అనుభూతి కలిగింది. అనేక జన్మల అపరిమితమైన పుణ్యపారమితల కారణంగా ఈ అనిత్యబోధ ధర్మగంగలో పాపతాపాలన్నీ శుభ్రపడసాగాయి. అక్కడే కూర్చున్న పాటునే పటాచార నిర్వాణంలోని మొదటి స్థితిని పొందింది. స్రోతాపన్న అయింది.

కృతజ్ఞతాభావంతో తడిసిముద్దయి పటాచార భగవానునికి నమస్కరించింది. ప్రవ్రజ్య యాచించింది. భగవానుడు ఆమెను భిక్షుణిల వద్దకు పంపి ప్రవ్రజితురాలిని చేయించాడు. పటాచార పూర్ణముక్తి మార్గంపై దృఢపూర్వకంగా నడవసాగింది.

తనలో ఇంకా ఏ భవసంస్కారాలైతే మిగిలిపోయి ఉన్నాయో, వాటిని ఎదుర్కోవలసి ఉంది. అంతర తపం చేస్తూ వాటిని విపశ్యనాగ్నిలో కాల్చిమసి చేయాల్సి ఉంది. సాధనలో ఇబ్బందులు వస్తున్నాయి. అప్పుడప్పుడు అకాలమృత్యువుకు గురైన తనవాళ్ళ జ్ఞాపకాలు చికాకు పెడుతున్నాయి. గడచిన సంఘటనలు మనసులో ముల్లుల్లా గుచ్చుకుంటూనే ఉన్నాయి. సాధన సజావుగా సాగడం లేదు.

ఒకరోజు సాయంత్రం మనసును గట్టి చేసుకొని దృఢ నిశ్చయంతో సాధన చేయడానికి సిద్ధమవుతూ ఉంది. కాళ్ళు కడుక్కోవడానికి చెంబెడు నీళ్ళు తన కాళ్ళమీద పోసుకొంది. నేలపైన పడ్డ నీళ్ళు కొంచెం దూరం వెళ్ళి ఆగిపోయాయి. ముందుకు వెళ్ళలేకపోయాయి. పొడిబారిన నేల ఆ నీటిని పీల్చేసుకుంది. నీటి తడి ఆరిపోయింది. మళ్ళీ మరో చెంబెడు నీళ్ళు కాళ్ళపైన పోసింది. ఈసారి జలధార మొదటిసారి కంటే కొంచెం ఎక్కువ దూరం వెళ్ళి ఆగి పోయింది. మళ్ళీ మూడో చెంబెడు నీళ్ళు పోసింది. జలధార ఇంకొంచెం దూరం వెళ్ళి ఆగిపోయింది.

ఈ చిన్న సంఘటన ఆమె అంతర జ్ఞానతంతువులను ఊపివేసింది. మోహజన్యపు అజ్ఞానపరదాలను తొలగించి వేసింది. ఈ జలధార లాంటిదే జీవనధారకూడా! ఈ లోకంలో ఒక్కొక్కరి జీవనధార తక్కువ వయసులోనే ఆగిపోతుంది. ఒక్కొక్కరి జీవనధార నడివయస్సులో ఆగిపోతుంది. ఒక్కొక్కరిది ముసలివయసులో ఆగిపోతుంది. కాని అందరినీ మృత్యువు కబళించివేస్తుంది. ఎవ్వరూ మిగలరు. అందరూ మరణిస్తారు. లోకంలో మరణించనివారంటూ ఎవ్వరూ లేరు. ఈ మరణానుస్మృతి ఆధారంగా సాధన చేయడానికి కూర్చుంది. అదే సమయంలో భగవానుడు పలికిన అమృతవాణి ఆమె చెవుల్లో మారుమ్రోగింది.

***యో చ వస్ససతం జీవే, అపస్సం ఉదయబ్బయం।***
***ఏకాహం జీవితం సెయ్యో, పస్సతో ఉదయబ్బయం॥***

విపశ్యన ద్వారా అనుభూతిపరంగా ఉదయ–వ్యయాల(అనిత్య) సత్యాన్ని తెలుసుకోకుండా నూరేళ్ళు జీవించడం కన్నా, (అనుభూతిపరంగా) ఉదయ–వ్యయాలను(అనిత్యతను) గమనిస్తూ ఒకరోజు జీవించటమే అధిక శ్రేష్ఠము, శ్రేయస్కరము.

ధర్మవాణి విన్న సాధకురాలు పటాచార రోమరోమం పులకించి పోయింది. "నేను నా పాతికేళ్ళ జీవితాన్ని నాలోని ఉదయ-వ్యయాల అనిత్యసత్యాన్ని తెలుసుకోకుండానే పోగొట్టుకున్నాను. ఇప్పుడు భగవానుని అపారమైన అనుకంపతో ఈ సత్యం యొక్క సాక్షాత్కారం కలిగింది. ఈ సత్యం పట్ల సాక్షీభావం నిలిపి ఉంచుకున్నందువల్లనే నాకు నిర్వాణం యొక్క ప్రథమ దర్శనమయింది. ఈ ఉదయ-వ్యయాల నిరంతర దర్శనం చేస్తూ చేస్తూనే తరువాతి స్థితులు ప్రాప్తిస్తాయి. రైతు పొలంలో శ్రమిస్తాడు. పొలం దున్నుతాడు, విత్తనాలు నాటుతాడు కాబట్టే ఫలం పొందుతాడు. నేను శుద్ధశీలంలో ప్రతిష్ఠితమైన బుద్ధపుత్రిని. ఆయన చూపిన మార్గంలో అప్రమత్తురాలినై పురుషార్థంతో పరాక్రమిస్తూ పరిశ్రమిస్తే పరమముక్త్యావస్థను పొందేతీరుతాను". ఇలా దృఢంగా నిశ్చయించుకొన్న పటాచార తన కుటీరంలో విపశ్యన చేయడానికి కూర్చుంది.

దగ్గర్లో ఉన్న దీపశిఖ కొడిగట్టుకు పోసాగింది. దాన్ని సరిచేసే ప్రయత్నం చేసింది. కాని దానివల్ల దీపశిఖ ఆరిపోయింది. మళ్ళీ ఆమెలో అంతర్బోధ కలిగింది. ఏ విధంగానైతే ఈ దీపశిఖ ఆరిపోయిందో, అదే విధంగా నాలోని రాగ, ద్వేష మోహ సంస్కారాల మంటలు ఆరిపోతాయి, నా మనుష్యజీవితం సార్థకమవుతుంది.

పటాచార మరింత దృఢచిత్తంతో విపశ్యన చేయడంలో లగ్నమయింది. శరీరం యొక్క, చిత్తం య్యొ ప్రపంచాన్ని, దాని అనిత్యస్వభావాన్ని తటస్థభావంతో చూడటం వలన, అంతర్మనసుపై పడిఉన్న భవసంస్కారాల పొరలు తొలగిపోసాగాయి. రాత్రి గడవక ముందే ఆమె స్రోతాపన్న నుండి సక్దాగామీ, సక్దాగామీ నుండి అనాగామీ, అనాగామి నుండి అర్హంత స్థితి వరకు చేరుకుంది. భవచక్రం తునాతునకలైపోయింది. పరిపూర్ణ ముక్తి లభించింది. మనుష్యజీవితం సఫలమయింది, సార్థకమయింది.

పటాచార భగవానుని ప్రముఖ శిష్యురాళ్లలో ఒకరయింది. భిక్షు-భిక్షుణీల్లో, గృహస్థులైన స్త్రీ-పురుషుల్లో భగవానుడు అగ్రగాములుగా పరిగణించిన అతికొద్దిమందిలో పటాచార కూడా స్థానం పొందింది. భిక్షుణీల వినయనియమాలను బాగా అర్థం చేసికొని వాటిని చక్కగా పాటించే సాధ్వీమణుల్లో పటాచార అగ్రగణ్యురాలిగా పరిగణించబడింది. ఆమె తన శేష జీవితమంతా తనలాంటి దుఃఖిత మహిళలను ధర్మమార్గంలోకి ప్రవేశింపజేసి వారిని దుఃఖముక్తులను చేయడంలోనే గడిపింది. తన మేలుతో పాటు అనేకమంది మహిళల మేలుకు కారకురాలయింది. పటాచార విపశ్యనను పొంది ధన్యురాలయింది. విపశ్యన కూడా పటాచార వంటి సాధ్వీమణిని (సాధకురాలిని) పొంది ధన్యమైంది.

**భవతుసబ్బ మఙ్గలమ్**

*(విపశ్యన పరిశోధనా సంస్థ వారి ప్రచురణ 'జాగే పావన్ ప్రేరణా' హిందీ పుస్తకం నుండి అనువాదం)*

**ముఖ్య సూచన**

ధమ్మ విజయ విపశ్యన ధ్యానకేంద్రములో సతిపట్ఠాన శిబిర తేదీలలో మార్పు చేయబడినది. ఈశిబిరం డిసెంబర్ 4 నుండి 12 వరకు నిర్వహించబడును.

**దీర్ఘ శిబిరము :**

ధమ్మఖేత విపశ్యనా కేంద్రములో 2010-2011లో ఈ క్రింది దీర్ఘశిబిరములు నిర్వహించబడును

**30 రోజుల శిబిరము :** 28 డిసెంబర్ 2010 నుండి 28 జనవరి 2011 వరకు

**20 రోజుల శిబిరము :** 7 జనవరి 2011 నుండి 28, జనవరి 2011 వరకు

**సంవత్సర చందా రూ. 50/- , 5 సంవత్సరముల చందా రూ. 200/- ఈ క్రింది చిరునామాకు పంపి పత్రికను పొందగలరు.**

**విపశ్యన తెలుగు మాసపత్రిక,**

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు - **500 070.** ఫోన్ : **24240290** (ఆశ్రమం).

***(ఆఫీసు పనిచేయు వేళలు : ఉదయం 9 గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు)***

Postal Reg. HSE 864/2010-2012 RNI Reg. No. APTEL/2006/17745

**PRINTED MATTER**

TO

If Undelivered please return to:
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org

Published for Vipassana International Meditation Centre, 12/6 KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd. (A.P) -70. Ph : 040-24240290. Published by Smt. Sabrina Katakam. Editor : Sri O. Premanand. Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 23325979.